వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- బండారులంకలో ఎన్నికల ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్



బండారులంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, ప్రజా బలంతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రూరల్ మండలం బండారులంకలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత బండారులంకలోని చినచంద్రపురం లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలేపు భీమేశ్వర సిద్ధాంతి నివాసం నుంచి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విశ్వరూప్‌కు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి ప్రజా స్పందన చూడలేదని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ఇదే సంకేతమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకీలక్ష్మి, కామిశెట్టి కుసుమ, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, వుటూకుని సుబ్రహ్మణ్యస్వామి, చేనేత, సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే జనం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అన్నంపల్లి, కమిని, గాడిలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



అన్నంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణ



ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉంటారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి, కమిని, గాడిలంక పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. పేదల పక్షాన్న నిలబడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ నెల 19న నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, నల్లా, సర్పంచ్‌లు మట్టపర్తి సత్యనారాయణ, సలాది సీతారామచంద్రరావు, పెద్దిరెడ్డి మునీంద్రరావు, పాము నాగవేణి, పాము చిట్టిబాబు, పెసింగ్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

18న అమలాపురం వెంకన్న కల్యాణం

- 19న తీర్థం, రథోత్సవం
- పది రోజుల పాటు కల్యాణోత్సవాలు



అమలాపురం పెళ్లిళ్ల వెంకన్న ఆలయంలో స్వామి, అమ్మవార్లు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు 24వ తేదీతో ముగియనున్నాయి. రోజుకో పూజా క్రతువుతో, సాంస్కృతిక కార్యక్రమాలతో పది రోజుల పాటు ఈ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 11.04 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం, అదే రోజు రాత్రి గరుడ వాహనోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్‌పర్సన్ దూడల విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు తెలిపారు. 19వ తేదీన ఆలయ ప్రాంగణంలో తీర్థం, అదే రోజు సాయంత్రం 4.02 గంటలకు పురవీధుల్లో రథోత్సవం జరుపుతామన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8.26 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుణ్ణి, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేసే తంతును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 4.53 గంటలకు ఎదురు సన్నాహ కార్యక్రమం జరిగింది. స్వామివారి కల్యాణం సందర్భంగా గురువారం మధ్యాహ్నం భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. 20వ తేదీ పొన్న వాహనోత్సవం, 21న సదస్యం, శేష వాహనంపై తెప్పోత్సవం, అశ్వగంధర్వ వాహనోత్సవం, 22న ఆంజనేయస్వామి వారి వాహనోత్సవం, 23న పూర్ణాహుతి, చక్ర స్నానం, చివరి రోజు 24వ తేదీన బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవోత్సవం, శ్రీపుష్పోత్సవం క్రతువులతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి తెలిపారు. భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణోత్సవాలను తిలకించి స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

75 మంది వలంటీర్ల రాజీనామా



పోలేకుర్రులో రాజీనామా చేసిన వలంటీర్లు

తాళ్లరేవు: మండల పరిధిలోని పోలేకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 26 మంది, తాళ్లరేవు సచివాలయం-1 పరిధిలో 13 మంది, గోవలంక పంచాయతీకి చెందిన 18 మంది, పటవల పంచాయతీ నుంచి మరో 18 మంది కలిపి మొత్తంగా 75 మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. తమకు ఎంతో గౌరవం ఇచ్చిన తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం కోసం పని చేసేందుకే రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు.



నడవపల్లిలో మూకుమ్మడిగా రాజీనామా చేసిన వలంటీర్లు

నడవపల్లి పంచాయతీలో..

కాట్రేనికోన: మండలంలోని నడవపల్లి పంచాయతీకి చెందిన 18 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందచేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన వలంటీర్లను జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నల్లా నరసింహమూర్తి, పాలెపు ధర్మారావు, సత్యమాంబికా వర్మ తదితరులు అభినందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ముమ్మిడివరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధి టీటీఆర్ నగర్‌లో పారడైజ్ అపార్ట్‌మెంట్‌లో వంట గ్యాస్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాలు, వాటి నివారణపై ప్రయోగాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు, కేపీఎస్ఎస్ నారాయణ, కె.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అపార్ట్‌మెంట్ల వాసులకు అవగాహన

అమలాపురం టౌన్: అపార్ట్‌మెంట్లలో సంభవించే అగ్ని ప్రమాదాల విషయంలో అక్కడ నివసించేవారంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు పట్టణంలోని అపార్ట్‌మెంట్ల వాసులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో కొండబాబు మాట్లాడారు. అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒక వేళ ప్రమాదం అనివార్యమైతే ఎలా నివారించాలి వంటి విషయాలపై లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్ వివరించారు.



అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిరుపయోగంగా బస్ షెల్టర్



తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో నిరుపయోగంగా మారిన బస్‌షెల్టర్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. అమలాపురం, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ప్రయాణికులు ఇక్కడ ఎదురుచూస్తుంటారు. గతంలో ఈ ప్రాంతంలో పంచాయతీ నిర్వహణలో భారీ బస్ షెల్టర్ ఉండేది. అది కాలక్రమేణా కనుమరుగు కావడంతో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తిరిగి బస్ షెల్టర్‌ను పునర్నిర్మించారు. అయితే అది సరైన నిర్వహణ లేకపోవడంతో చెత్త చెదారాలు పేరుకుపోయి ప్రయాణికులు కూర్చునేందుకు వీలు లేకుండా తయారైంది. దీంతో ప్రయాణికులు ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బస్ షెల్టర్‌లను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

యానాంలో 144 సెక్షన్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో యానాం రీజియన్‌లో సైతం 144 సెక్షన్ అమలుకు పుదుచ్చేరి జిల్లా మెజిస్ట్రేట్ ఎ.కుళొత్తుంగన్ ఆదేశాలు జారీ చేశారని ఆర్ఏఓ మునిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం పోలింగ్ జరగడానికి 48 గంటల ముందు పార్టీలు తమ ప్రచారాలను నిలిపివేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లకు 100 మీటర్ల పరిధిలో సెల్‌ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్ల వినియోగం అనుమతించమన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి, శాంతిభద్రతలు కాపాడే సిబ్బందికి దీనికి మినహాయింపు ఉందన్నారు. ఎక్కడా ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని, పోలింగ్ సర్వేలు, ఒపీనియన్ సర్వేలకు మీడియాకు అనుమతి లేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

అల్లవరం: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ఏదైనా ఫీల్డ్ వర్క్ లేదా ఆఫీస్ పనివేళల్లో బయటకు వెళ్లవలసి వస్తే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని గోడిలంక, మొగళ్ళమూరు, తుమ్మలపల్లి, గోడి, గోడితిప్ప, కోడూరుపాడు, గూడాల గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగుల మూవ్‌మెంట్ రిజిస్టర్‌లను తనిఖీలు చేశారు. కొంతమంది సచివాలయ ఉద్యోగులు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై మందలించారు. ఇక ముందు ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి, కనకమ్మ, రవిరాజు, సిబ్బంది స్పందన, లలిత, శ్రావణి, కోమలి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర తదితరులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జున రావు, ధర్మకర్తలు, ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మద్దింశెట్టి ప్రసాద్, నల్లా పవన్‌కుమార్, మెట్ల రమణబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రజల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: మండు వేసవిలో వాహన చోదకులు, బాటసారుల దాహార్తిని చలివేంద్రాలు తీరుస్తున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో మిత్రా సేవా సమితి ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను మిత్రా సేవా సమితి ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మిత్రా సేవా సమితి ప్రతినిధులు కొల్లు శ్రీనివాస రావు, దొమ్మేటి రాజేష్, చొడువాడ శంకర్, సూరిశెట్టి అనిల్, షేక్ కన్నా సాహెబ్, జంగా సత్తిబాబు, కర్లెళ్ల శ్రీను, తణుకు భద్రం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ ఉత్సవాలు

అల్లవరం: బంగారు తిరుపతిగా ప్రసిద్ధి చెందిన బెండమూర్లంకలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆలయంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న స్వామివారి కల్యాణ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వాహకుడు గుర్రం సత్యనారాయణ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కల్యాణ ఉత్సవాల్లో తొలి రోజు బుధవారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, గురువారం స్వామి, అమ్మవార్లకు దివ్య కల్యాణం, శుక్రవారం పూర్ణాహుతి, చక్రస్నానం, గ్రామోత్సవం నిర్వహించడానికి వేద పండితులు నిర్ణయించారన్నారు.

కందుకూరి ఆదర్శనీయుడు

యానాం: తెలుగులో మొదటి సైన్స్ పుస్తకాన్ని రచించడంతో పాటు అనేక సంఘ సంస్కరణలకు బాటలు వేసిన కందుకూరి వీరేశలింగం అందరికీ ఆదర్శనీయుడని పలువురు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యానాం పబ్లిక్ స్కూల్‌లో కందుకూరి జయంతి జనవిజ్ఞాన వేదిక యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కందుకూరి గురించి నేటి తరం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భారతీదేవి, ఉపాధ్యాయులు బాలాజీ, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

బలహీనంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదాయపన్ను శాఖలు

యానాం: దేశంలో బీజేపీ హయాంలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదాయపు పన్ను శాఖలు బలహీనంగా మారాయని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య రక్షణకు కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరారు. ఆదాయపుపన్ను, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలను ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మోడీ ప్రజలకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. పుదుచ్చేరి, తమిళనాడుల్లో ఇండియా కూటమి విజయం తథ్యమని చెప్పారు.

ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు

యానాం: కనకాలపేటలో కొలువైన కోదండ రామస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో 77వ శ్రీరామ నవమి ఉత్సవాలను మంగళవారం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌లకు అభిషేకం, సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం స్వామివారి కల్యాణం, అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవం, సీతారామకల్యాణం బుర్ర కథ ప్రదర్శన ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ముగ్గులు వేసి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డ్వాక్రా సభ్యులు

ఉప్పలగుప్తం: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. స్థానిక గ్రామంలో ఉన్న చేయూత మహిళా మార్ట్ ఆవరణలో వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.భూపతి వర్మ ఆధ్వర్యంలో మంగళవారం డ్వాక్రా సభ్యులు, వీఓఏలతో ముగ్గులు వేయించి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా బలమైన ఆయుధమని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ బి.సత్యనారాయణమ్మ, కె.దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 150 మంది చేరిక



రెడ్డివారిపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న పితాని బాలకృష్ణ

తాళ్లరేవు: మండల పరిధిలోని తాళ్లరేవు గ్రామ పంచాయతీ రెడ్డివారిపేట గ్రామానికి చెందిన 150 మంది వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నేత పితాని బాలకృష్ణ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. అలాగే తాళ్లరేవుకు చెందిన సీనియర్ నాయకుడు చిట్టూరి చలపతి, మట్టపర్తి సత్యనారాయణ, పిల్లంక గ్రామానికి చెందిన పెంకే అర్జునరావు తదితరులను కలిసి పార్టీకి మద్దతుగా ఉండాలని కోరారు. అనంతరం స్థానిక మాధవరాయునిపేటలో ప్రమాదవశాత్తూ గాయపడిన రేవు బాలయోగిని పితాని బాలకృష్ణ పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో టేకుమూడి రాంబాబు, ఇళ్ల మహేశ్వరరావు, శెట్టిబలిజ నాయకులు రెడ్డి సతీష్, పితాని సత్తిబాబు, టేకుమూడి త్రిమూర్తులు, నరాల రామకృష్ణ, బొంతు మోహన్, మట్టపర్తి లోవరాజు, పంపన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సూక్ష్మ పరిశీలకులుగా నియమితులైన బ్యాంకు ఉద్యోగులు, ఓఎన్జీసీ ఉద్యోగులకు కలెక్టరేట్ గోదావరి భవన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరిగినా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ నిర్వహణకు గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ స్టేషన్లు పరిశీలించాలని సూచించారు. అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటూ, ఓటర్లు వరుస క్రమంలో వచ్చేలా చూడాలన్నారు. పోలింగ్ విధానాన్ని పరిశీలించి మైక్రో అబ్జర్వర్లకు ఇచ్చిన ఫార్మెట్‌లోనే నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ విధానాన్ని, ఈవీఎం, వీవీప్యాట్ వినియోగించే విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు డీఆర్డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్, ఎల్‌డీఎం కె.శ్యాంబాబు, మాస్టర్స్ ట్రైనీలు పాల్గొన్నారు.

ప్రచార పర్వానికి నేటితో తెర



కనకాలపేటలో ప్రచారం నిర్వహిస్తున్న కనకాల రాజు తదితరులు




ఎన్నికల ప్రచారంలో ఇండిపెండెంట్ అభ్యర్థి పోసియ్య

యానాంలో ముమ్మరంగా పార్టీల ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి బుధవారం ఒక్కరోజే మిగిలి ఉండడంతో వివిధ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోరుతూ మంగళవారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పిలుపు మేరకు బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతుగా స్థానిక బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో కనకాలపేట, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అదేవిధంగా ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ ఆధ్వర్యంలో అగ్రహారం తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగంకు మద్దతుగా మల్లాడి సత్తిబాబు, అధ్యక్షుడు అర్థాని దినేష్, దవులూరి పతి, బీరాస్వామి, బంగారం, చక్రవర్తి తదితరులు పట్టణంలో త్యాగరాజవీధి, పిల్లారాయవీధి, చిన్నాసెంటర్‌ల్లో ప్రచారం చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న యానాంకు చెందిన అరదాడి పోసియ్య ఇంటింటికీ వెళ్లి తనకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

అకౌంటింగ్ బృందానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వీడియో చిత్రీకరణ, స్టాటిస్టిక్ సర్వైలెన్స్, మీడియా మానిటరింగ్, సహాయ వ్యయ పరిశీలకులంతా అకౌంటింగ్ బృందానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఎన్నికల నోడల్ అధికారి వి.శివశంకర్ ప్రసాద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో వీడియో చిత్రీకరణ, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల అభ్యర్థుల ప్రచార ఖర్చులు, సమావేశాల ర్యాలీలు, బహిరంగ సభలు, ఊరేగింపులకు సంబంధించిన వీడియో చిత్రీకరణలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వాయిస్‌తో సహా చిత్రీకరించాలన్నారు. దీనివల్ల ఆయా వీడియోల ఆధారంగా ఖర్చులను అభ్యర్థుల ఖాతాలో బుక్ చేసేందుకు అకౌంటింగ్ బృందానికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రతి ప్రచార కార్యక్రమాన్ని వీడియో ద్వారా చిత్రీకరించాలని సూచించారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ద్వారా ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాలలో అభ్యర్థులు ఇచ్చే ప్రకటనలపై ముందస్తు అనుమతి పొందాలని ఎంసీఎంసీ కమిటీ కన్వీనర్ డీపీఆర్ఓ కె.లక్ష్మీనారాయణ వివరించారు. సామాజిక మాధ్యమాలలో అభ్యర్థుల తరఫున ప్రకటనలను గణించి అకౌంటింగ్ విభాగానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ సభ్యులు సీబీసీ క్షేత్రస్థాయి అధికారి పి.శ్రీరామ్మూర్తి, సీపీఓ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం కె.శ్యామ్‌బాబు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

18న నోటిఫికేషన్ విడుదల

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి వి.మధుసూదనరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్ల పరిశీలనతో పాటు అదే రోజు గుర్తులు కేటాయిస్తామన్నారు. 26 నుంచి 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.శ్రీనునాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబులు పాల్గొన్నారు.